క్లుప్తంగా

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న స్వప్న

జమ్మికుంట: మండలంలోని వావిలాలలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పూల్లూరి స్వప్నసదానందం గురువారం భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజురు చేసిందని, త్వరగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్‌శాఖ డీఈ శ్రీకాంత్, ఏఈ శివకుమార్, కార్యదర్శి రాము, నాయకులు నూలక రాజేశం, గోపాలచారి, మల్లేశం, రాజమౌళి, పొన్నం తిరుపతిగౌడ్, కొండ అర్జున్, మర్రి వేణు, మామిడి దాసు, సదానందం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నేడు తుది గడువు

చిగురుమామిడి: ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు చివరి గడువు శుక్రవారంతో ముగియనుందని చిగురుమామిడి మండల కో ఆర్డినేటర్ లక్ష్మన్ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 26 మంది పదో తరగతి, 23 మంది ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకున్నారని, పుస్తకాలు త్వరలో పంపిణీ చేస్తామన్నారు. మరో 26 మంది ఓపెన్ టెన్త్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ జనన ధ్రువీకరణ పత్రాలు సరిగా లేనందున తిరస్కరించామన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ఎంఈవో, తదితరులు

తిమ్మాపూర్: గురుపూజోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న పత్తెం వసంత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. గురువారం మండల విద్యాధికారి శ్రీనివాస్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం, కేజీబీవీ ఎస్‌వోలు పడాల కిరణ్, జ్యోతి, మధులత, ఉపాధ్యాయులు వసంతను అభినందించారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి

తిమ్మాపూర్: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని ప్రతీ బూత్‌లో జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, సేవా పక్వాడ్ జిల్లా కన్వీనర్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో గురువారం మండల కార్యశాల ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి నాగేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సేవా పక్వాడ్ నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని, రక్తదానం, చిత్రలేఖన పోటీలు నిర్వహించే విధంగా కార్యకర్తలు రూపకల్పన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఇంచార్జి నరహరి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల కన్వీనర్ కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, కో కన్వీనర్ ఎర్రోజు లక్ష్మణ్, కార్యకర్తలు బుర్ర శ్రీనివాస్ గౌడ్,జంగ సునీల్ రెడ్డి,గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కామెర వెంకటేశ్, మేకల అనిల్, తమ్మనివేణి మహేశ్, గణేష్ తదితరులున్నారు.

బోర్‌వెల్ మంజూరు

వీణవంక: మండలంలోని కనపర్తి గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి ఆవరణలో మంచినీటి వసతి కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బోర్‌వెల్ మంజూరు చేశారు. గురువారం బోరు మోటారు బిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, వెంకటేశ్వర్లు,శ్రీనివాస్‌రెడ్డి, అభిలాశ్, శ్రీనివాస్, అనీశ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి, సారయ్య ఉన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంలో గురువారం వరిలో తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ రకాలు తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు వివరించారు. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం పాముపొడ తెగులు ఎక్కువగా ఉందని సూచించిన మందులు పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో శంకర్, అమరేందర్‌రెడ్డి, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

సిల్ట్ తీయరు.. నీరు పారదు

- ఎస్సారెస్పీ ఉపకాలువల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఏటా ఒక్కసారి తొలగించాలని నిబంధన
- గ్రామాల సమీపంలో పరిస్థితి అధ్వానం
- గండిపడే అవకాశం ఉందంటున్న రైతులు
- పట్టించుకోని సంబంధితశాఖ అధికారులు



మానకొండూర్ వద్ద డీబీఎం 3 కాలువ పొంగి పొర్లడంతో వరిపొలంలో ఇసుక మేటలు

మానకొండూర్: ఎస్సారెస్పీ ఉపకాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. కాలువలు చెత్తాచెదారంతో నిండుకుపోయాయి. సిల్ట్ తొలగించకపోతే కాలువలకు గండిపడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. సిల్ట్ కారణంగా సాగునీరు ముందుకు వెళ్లడం లేదు. చెత్తాచెదారం కారణంగా ఇప్పటికే పలు కాలువల్లో సాగునీరు పొంగిపొర్లిన సంఘటనలున్నాయి. ఉపాధిహామీ కూలీలతో కాలువల్లో సిల్ట్ తొలగించాల్సి ఉన్నా ఏటా ఒక్కసారి మాత్రమే కాలువల్లో పూడిక తీయాలనే నిబంధనతో ఏడాది పూర్తయితే తప్పా తొలగించే అవకాశం లేకుండా పోయింది. మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి నుంచి గట్టుదుద్దెనపల్లి వరకూ డీబీఎం 2 నుంచి 9 ఎస్సారెస్పీ ఉపకాలువలున్నాయి. డీబీఎం 6, ఉప కాలువల మినహా అన్ని ఉపకాలువలు చెత్తాచెదారంతో నిండుకున్నాయి. కాలువల వెంట చెట్లు ఏపుగా పెరగడంతో లైనింగ్ దెబ్బతింటుంది. మానకొండూర్ రైస్‌మిల్లు, సదాశివపల్లి మీదుగా వెళ్లే డీబీఎం 2, ముంజంపల్లి, మానకొండూర్, శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి మీదుగా వెళ్లే డీబీఎం 3, ఈదులగట్టెపల్లి సమీపంలోని డీబీఎం 4, 5, గంగిపల్లి, కొండపలకల మీదుగా వెళ్లే డీబీఎం 7, గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్ 9 మీదుగా వెళ్లే ఉపకాలువల పరిస్థితి అధ్వానంగా మారడంతో సాగునీరు ముందుకు పారడం లేదు. కాలువల ద్వారా సాగునీరు ఎక్కువ మొత్తంలో విడుదల చేస్తే ఉప కాలువలకు గండి పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే డీబీఎం2, సదాశివపల్లి, మానకొండూర్ రైస్‌మిల్లుల వద్ద, డీబీఎం 3 మానకొండూర్ వద్ద సాగునీరు కాలువల గట్లపై నుంచి సాగునీరు పొంగి పొర్లింది. దీంతో పంట పొలాల్లో ఇసుకమేటలు వేయడంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆనవాళ్లు కనిపించకుండా సదాశివపల్లి డీబీఎం 3 కాలువలో పెరిగిన గడ్డి



దెబ్బతిన్న కల్వర్టు

నిబంధన తొలగిస్తే మేలు...

కాలువల్లో పూడిక, చెత్తాచెదారం ఉపాధిహామీ కూలీల ద్వారా తొలగిస్తున్నారు. దీంతో కాలువలు శుభ్రం అవుతూ ఆయకట్టుకు సరిపడా సాగునీరు అందడమేకాకుండా ఇటు కూలీలకు పని దొరికినట్టు అవుతుంది. అయితే ఇది ఏడాదికి ఒక్కసారి మాత్రమే. ఈ నిబంధనతో ఏడాదిలో రెండోసారి పనిచేసే వీలులేకుండా పోయింది. ప్రధానంగా గ్రామాల సమీపంలోని కాలువల్లో చెత్తాచెదారం వేస్తుండటంతో పాటు కాలువల్లో తుంగ, కాలువల లైనింగ్‌ల వెంట వివిధ రకాల మొక్కలతోపాటు ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో కాలువలు కనిపించకుండా పోతున్నాయి. కాలువల్లో ఎప్పుడు చెత్తాచెదారం నిండితే అప్పుడే తొలగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సాగునీరు అందించే కాలువల్లో పూడిక తొలగించి కాలువలకు గండి పడే ప్రమాదం నివారించాలని రైతులు కోరుతున్నారు.



హుజూరాబాద్: హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంత రోడ్లపై అడుగుకో గుంత ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడటంతో మృతిచెందిన సంఘటనలున్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. సిరిసేడు నుంచి మల్యాల ప్రధాన రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్డు మట్టిరోడ్డుగా తయారైందని అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పల్లా రాజశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ, సెల్ నంబర్: 8328131368

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పవర్‌లూమ్స్ పరిశ్రమను ఆదుకోవాలి

- విజిలెన్స్ అధికారుల దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కార్మికుడిని పరామర్శిస్తున్న సుంకె రవిశంకర్

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామంలో చేనేత కార్మికుడిపై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేయడం సరికాదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి చేనేత కార్మికుడు మిట్టపల్లి వెంకటేశ్‌ను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గర్షకుర్తి గ్రామ పవర్‌లూమ్స్ పరిశ్రమకు బతుకమ్మ చీరల తరహా గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు కల్పించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో పవర్‌లూమ్స్‌కు బతుకమ్మ చీరల ఉత్పత్తికి ఆర్డర్ ఇవ్వడంతో కార్మికులు జీవనోపాధి పొందారని పేర్కొన్నారు. ఎంతో ధీమాగా బతికిన చేనేత కుటుంబాలు ప్రస్తుతం పనులు లేక అవస్థలు పడుతుంటే మరోవైపు చేనేత జౌళిశాఖ విజిలెన్స్ అధికారులు పవర్‌లూమ్స్‌పై దాడులు చేస్తూ కేసులు పెడుతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆకలిచావు, ఆత్మహత్యలు పునరావృతం అవుతాయని, ఇకనైనా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని, చేనేత కార్మికులపై పెట్టిన కేసులు తొలగించాలని, దాడులు చేయొద్దని సూచించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రాములు

ఇల్లందకుంట: రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ (ఆర్ఏఏ) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మండలంలోని కనగర్తి ఎంపీపీఎస్ విద్యార్థులు కౌశిక్‌నందన్, శ్రీవర్షిత, కృష్ణవేణి మొదటి స్థానంలో నిలిచారు. గురువారం ఇన్‌చార్జి ఎంఈవో కొర్ర రాములు విద్యార్థులను అభినందిస్తూ కృషిచేసిన ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, కుమారస్వామి లను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు అనేక రకాల పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమూర్తి, హైస్కూల్ ఇంచార్జి హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు కుమారస్వామి, సుజాత పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

చొప్పదండి: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, టీం స్పిరిట్ పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ దీక్షిత్ అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులతో నాలుగు గ్రూపులు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో జరిగే అన్ని కార్యక్రమాల్లో నాలుగు గ్రూపుల విద్యార్థులను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. పాఠశాల హెడ్ బాయ్‌గా డి.రాజా, హెడ్ గర్ల్‌గా మేఘన ఎంపికయ్యారు. టీం మెంటర్లుగా లక్ష్మణ్‌కుమార్, రాజమౌళి, హరిత, ఉమారాణిని ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చిగురుమామిడి: వికలాంగులు ఫోర్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో స్వయం ఉపాధి పథకాలపై శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు. సుందరగిరిలో గురువారం జీపీ కార్యాలయం ఆవరణలో వికలాంగులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్, టైలరింగ్, తదితర కోర్సులకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని సంస్థ మేనేజర్ మహ్మద్‌షాహిద్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికెట్లతో పాటు ఆయా బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. నాలుగు మండలాల కో ఆర్డినేటర్లు రాజు, లక్ష్మి, సాయిచరణ్,ఎల్లయ్య, మల్టీట్రైనర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ వసతి గృహాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉపసంచాలకుడు ఎం. నాగైలేశ్వర్ అన్నారు. గురువారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వసతిగృహాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార పదార్థాలు, పరిశుభ్రత, మెడికల్ క్యాంపులు, వసతి గృహ భవనాల మరమ్మతు తదితర అంశాలపై శ్రద్ధ చూపాలని సూచించారు.

ఆర్థికసాయం



నగదు అందిస్తున్న డెయిరీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన, కరీంనగర్ డెయిరీ సభ్యుడు బద్దం తిరుపతిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను గురువారం డెయిరీ సభ్యులు పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ.ఐదువేలు గ్రామ డెయిరీ అధ్యక్షుడు బద్దం తిరుపతిరెడ్డి, సూపర్‌వైజర్ లక్ష్మీనరసయ్య అందజేశారు. తిరుపతిరెడ్డి రైతుబీమా భరోసా సభ్యుడు కాగా కుటుంబానికి రూ.యాభైవేలు త్వరలో సంస్థ నుంచి మంజూరుకానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, పాడిరైతులు రమణారెడ్డి, కనకారెడ్డి, సింగిరెడ్డి రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

సైదాపూర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడించనున్నామని వికలాంగుల హక్కుల పోరాట సమితి సైదాపూర్ మండల అధ్యక్షుడు జక్కోజు భిక్షపతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు రూ.ఆరువేలు, వృద్ధులు, వితంతువులకు రూ.నాలుగు వేల పెన్షన్ ఇవ్వాలనే డిమాండ్‌తో కార్యక్రమం చేపట్టనున్నామని, మండలంలోని అన్ని గ్రామాల నుంచి వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అధికారుల తనిఖీ

జమ్మికుంట: పట్టణంలోని లక్ష్మీవెంకటరమణ ట్రేడర్స్, గణేశ్ ఫ్యాన్సీ కిరాణం, జనరల్ స్టోర్స్‌లో గురువారం జాయింట్ కమిషనర్ వాణిజ్య పన్నుల శాఖ అధికారి రజనీ ఆదేశాల మేరకు స్టేట్ జీఎస్టీ కరీంనగర్ డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. షాపుల్లోని వస్తువులను రికార్డు చేసుకున్నారు. కొనుగోలు బిల్లులు, అమ్మకం రశీదు పరిశీలించారు. తనిఖీల్లో అజయ్‌కుమార్, మహేశ్, విజయ్‌తోపాటు స్టేట్ ట్యాక్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

గన్నేరువరం: హైదరాబాద్‌లో ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ఫొటోగ్రాఫర్లు సద్వినియోగపరచుకోవాలని తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి అన్నారు. గురువారం గన్నేరువరంలో మండల ఫొటోగ్రాఫర్స్‌తో కలిసి ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతీ ఫొటోగ్రాఫర్ ప్రొఫెషన్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తుమ్మ చందు, కోశాధికారి మధుసూదన్ గౌడ్, పీఆర్‌వో పురం విక్రమ్, కార్యవర్గ సభ్యులు ఇనుకొండ దత్తాద్రి, మఠం దుర్గప్రసాద్ గన్నేరువరం మండల అధ్యక్షుడు రాపోలు సతీష్, ఉపాధ్యక్షుడు ఇనుకొండ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జీల వెంకటేశ్, కోశాధికారి వేముల రాములు, బూర తిరుపతి, రఘువరన్, నాగరాజు, మఠం ఆంజనేయులు, తిరుపతి, మహేందర్, మండల కార్యవర్గ సభ్యులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఏక్ ఫేడ్ మా కే నామ్



మొక్కలు నాటుతున్న టీచర్లు, విద్యార్థులు

శంకరపట్నం: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు టీచర్లతో కలిసి మొక్కలు నాటారు. ఏక్ పేడ్ మా కే నామ్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని హెచ్ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఫ్రెషర్స్ డే హంగామా



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తున్న పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అధ్యాపకులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థుల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఓదెలు కుమార్, స్టాఫ్ సెక్రటరీ రాజేంద్రం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మికుంట: పరీక్షలు చేస్తున్న వావిలాల పీహెచ్‌సీ వైద్యులు

వైద్యశిబిరం

చొప్పదండి: మండలంలోని వెదురుగట్టలో చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామస్తులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు వైద్య శిబిరం నిర్వహించి వివిధ పరీక్షలు చేశారు. వైద్యాధికారి శ్రీకీర్తన మాట్లాడుతూ... తొమ్మిది నెలల్లో 27 సాధారణ ప్రసవాలు చేశామని, ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా చొప్పదండి పీహెచ్‌సీని సంప్రదించాలని కోరారు. స్త్రీలు ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలకోసారి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో వెంకటస్వామి, సూపర్‌వైజర్ శ్రీదేవి, జాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం, హనుమండ్లపల్లి, మండలంలోని వెంకటేశ్వరపల్లి, మాచనపల్లి గ్రామాల్లో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 309 మందికి వివిధ పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. 17 మంది జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, ఆరోగ్య మహిళపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బిందు, దిలీప్‌కుమార్, ఝాన్సీ, సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఏఎన్ఎంలు రజిత, సావిత్రి, సరళ, కవిత తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: వెదురుగట్టలో చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో..

వెలిచాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వరలక్ష్మీ(ఇన్‌సెట్లో) శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

రామడుగు: గ్రామీణ ప్రాంతాల్లో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామీణ ప్రాంత అంశాలపై అవగాహన పెంచుకునే అవకాశం ఉందని కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.వరలక్ష్మి అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు తొలిరోజు పాఠశాల మైదానం శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ స్రవంతి, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్‌లు వీర్ల రవీందర్ రావు, కాడె శంకర్, స్థానిక నాయకులు బండపల్లి శ్రీకృష్ణ, వీర్ల హన్మంతరావు, రమణ, పూదరి తిరుపతి, పంచాయతీ కార్యదర్శి శ్యాం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన లారీ

శంకరపట్నం: కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. మంచిర్యాల నుంచి వరంగల్ వైపు బొగ్గులోడ్‌తో వెళ్తున్న లారీ కొత్తగట్టు గ్రామానికి చేరుకోగానే రోడ్డుపై ఇనుపగ్రిల్స్‌ను ఢీకొనడంతో వాహనం ముందుభాగం ధ్వంసమైంది.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టిన జేసీబీ, ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. కేశవపట్నంలో ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. జేసీబీ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.